

మినుములూరు పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మండలంలోని మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డిఎం అండ్ హెచ్‌ఒ సి.జమాల్ భాషా తనిఖీ చేశారు. వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సూచనలు చేశారు. ఆసుపత్రిలో సుఖ ప్రసవాలు, రికార్డులు నిర్వహణ అంశాలపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫ్యామిలీ ప్రోగ్రాం వైద్య శిబిరాల్లో వైద్య సిబ్బంది విధిగా హాజరు కావాలన్నారు. ఆయన వెంట పిహెచ్ సి వైద్యాధికారి గోపాలకష్ణ, జిల్లా టిబి పర్యవేక్షకులు వి.కిరణ్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఒ,

ఆగ్రహించిన అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించాలని భారీ ర్యాలీ, ధర్నా దద్దరిల్లిన కలెక్టరేట్, ఐటిడిఎ ప్రాంగణాలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి ఏజెన్సీలోని అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం పాడేరులో సోమవారం భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. స్థానిక మోదకొండమ్మ గుడి నుంచి కలెక్టరేట్ వరకు రెండు కిలోమీటర్ల దూరం భారీ ర్యాలీ కొనసాగింది. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి రెండు గంటల సేపు బైఠాయించారు. అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు పరచాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, జీతంలో సగం పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించి తమపై వేధింపులను అరికట్టాలని అంగన్వాడి వర్కర్లు నినాదాలు చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమ్మ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ ఆందోళన కార్యక్రమం కొనసాగింది.

సమస్యల పరిష్కారంపై కాలయాపన : ఉమా

ఈ సందర్భంగా సిఐటియు ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం పట్ల తీవ్ర కాలయాపన చేస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలు తన అక్కా చెల్లెలు అని ఆడపడుచులు అంటూ పాదయాత్రలో ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీలపై పని ఒత్తిడి పెంచి, జీతాలు మాత్రం పెంచలేదన్నారు. కొత్త యాప్‌లతో అంగన్‌వాడీలు సతమతమవుతున్నారన్నారు. వీరిపై రాజకీయ వేధింపులు అరికట్టి, సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేసి రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నాలో...

2 నెలలుగా వేతనాలు ఏవీ? : పడాల్

సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, అంగన్వాడీల పట్ల ప్రభుత్వం తీరు చాలా దుర్మార్గంగా ఉందని రెండు నెలల నుంచి జీతాలు లేవని తెలిపారు. నాణ్యమైన సరుకులు పంపిణీ చేయకుండా తనిఖీల పేరుతో అంగన్వాడీలపై రాజకీయ పెత్తనం, వేధింపులు తీవ్రమయ్యాయని అన్నారు. కేవలం రూ.150 రూపాయల జీతం నుంచి పనిచేస్తున్న అంగన్వాడి వర్కర్లు నేటికీ చాలా మంది ఉన్నారని చెప్పారు. మినీ అంగన్వాడీ కేంద్రాల్లో వర్కర్ పని ఆయా పని ఒక్కరే చేస్తున్నారని, తక్కువ వేతనం ఇస్తున్నారని, ఇది చాలా అన్యాయమని తెలిపారు. మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించుకుంటే అసెంబ్లీ ముట్టడి చేపడతామన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జిల్లా జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్‌కు అంగన్వాడి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందించి వినతి పత్రంలో ఉన్న అంగన్వాడీ వర్కర్ల సమస్యలను ఆయన చదివి వినిపించి అంగన్వాడి సమస్యలపై ప్రభుత్వానికి వివరిస్తామని, జిల్లా స్థాయిలో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బాలదేవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.సుందర్రావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్లు కళావతి, పెంటమ్మ, పెద్ద ఎత్తున అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



పాడేరులో భారీ ర్యాలీ చేపడుతున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

ఐటిడిఎ ముట్టడి

రంపచోడవరం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీనికి ముందు పురవీధుల్లో ప్రదర్శన చేపట్టి, అంబేద్కర్ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. అంగన్వాడీల నినాదాలతో ఐటిడిఎ దద్దరిల్లింది. ఈ సందర్భంగా యూనియన్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.నిర్మల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటి నుండి అంగన్వాడీ సెంటర్లలో ప్రవేశ పెట్టిన ఫేస్ యాప్‌ను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2 జిబి మొబైల్స్ ఇచ్చి 8 జిబి పనులు చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. నెట్ సౌకర్యం కూడా లేని కేంద్రాలున్నాయన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సంపూర్ణ పోషణకు మెనూ ఛార్జీలు పెంచాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ పేరుతో అంగన్వాడీ వర్కర్లపై వేధింపులు ఆపాలని, హెల్పర్లకు వయోపరిమితి లేకుండా అంగన్వాడీ వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని, ఫుడ్ కమిషనర్ వేధింపులు ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు, కె.శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా నాయకులు తీగల శ్రీనివాస్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి కె.రామలక్ష్మి, ఉపాధ్యక్షులు జి.బేబీ రాణి, కొర్రపు రాణి, ప్రాజెక్టు అధ్యక్షులు కె.కుమారి, రత్నకుమారి, కె.మంగాయమ్మ, బి.సింగరమ్మ, అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న అంగన్‌వాడీలు, నాయకులు



సర్వే సిబ్బంది కిట్లు పంపిణీ చేస్తున్న పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

భూముల రీ సర్వే వేగవంతం

- ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

జగనన్న భుహక్కు భూ రక్ష కార్యక్రమం ద్వారా భూముల రీ సర్వే వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన గ్రామ సర్వేయర్లకు సర్వేకు సంబంధించిన పరికరాలు, మెడికల్ కిట్లు, రైన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని మండలాలలో భూములు రీ సర్వే చేసి రైతులకు హక్కుపత్రాలు పంపిణీ చేసే విధంగా గ్రామ సర్వేయర్లు సుమారు 80 మందికి కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. గ్రామసభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ సర్వేకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్ కె.దేవేంద్రుడు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు రవి శంకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణం అసంపూర్తిగా వదిలేసిన రహదారిని పరిశీలిస్తున్న ఎంపిపి లక్ష్మి తదితరులు

కందులూరు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని మారుమూల కుందులూరు రహదారి నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ పంచాయతీ పరిధి తెల్లవారు గూడెం నుండి గుల్లెట్‌వాడ వరకు తవ్వి వదిలేసిన రహదారిని సోమవారం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణతో కలిసి ఎంపిపి లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్లవారి గూడెం నుండి గుల్లెట్ వాడ రహదారికి శంకుస్థాపన చేసి రెండేళ్లు కావస్తున్నా నేటికీ దాని నిర్మాణం పూర్తి చేయలేదని తెలిపారు. ఈ రహదారిని తవ్వి వదిలేయడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పనులు, వైద్య సేవల కోసం మండల కేంద్రానికి వెళ్ళాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. తక్షణమే ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి గుత్తేదారు యుద్ధ ప్రాతిపదికన రహదారి నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్న బాబు, నాయకులు పంకు సత్తిబాబు, లక్ష్మణరావు గ్రామస్తులు పాల్గొన్నారు.



వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్న గిరిజన మిత్ర ఫౌండేషన్ ప్రతినిధులు

వ్యవసాయ పరికరాల పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : వై.రామవరం మండలం మండింకోటలో గిరిజన మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై వాటర్ పంపు మోటార్లు, బరకాలు, ఇతర పరికరాలను సోమవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ జి బాబూరావు మాట్లాడుతూ ఏజన్సీ ప్రాంతాల్లో గిరిజన మిత్ర ఫౌండేషన్ అనేక సేవా కార్యకలాపాలు చేస్తుందన్నారు. రైతులకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీను, మంగిరెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని గాజువాక లైన్లో నివాసముంటున్న ఎం.వెంకటరమణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆ కుటుంబానికి వైఎస్ఆర్ బీమాలో భాగంగా తక్షణ సాయం కింద రూ.10వేలు చెక్కును స్థానిక ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లోవ కుమారి సమక్షంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి సాంబమూర్తి మాట్లాడుతూ వెంకటరమణ ఇంటికి పెద్దదిక్కుగా ఉండి అనారోగ్య కారణంగా మతి చెందడంతో వారి కుటుంబానికి తీరని లోటు కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన మిగిలిన మొత్తం వారి అకౌంట్‌లో నేరుగా జమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు స్వర్ణలత, బలరాం, గ్రామ సేవకులు బుజ్జి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న ఎంపిటిసి, ఇన్‌ఛార్జి సర్పంచ్ తదితరులు




అవగాహన కల్పిస్తున్న డిఎం అండ్ హెచ్‌ఒ జమాల్ బాషా

మాతా శిశు మరణాలపై

సమగ్ర అవగాహన ఉండాలి

- డిఎం అండ్ హెచ్‌ఒ జమాల్ బాషా

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మాతా శిశు మరణాలపై ఎంఎల్‌హెచ్‌పిలు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని డిఎం అండ్ హెచ్‌ఒ సి.జమాల్ భాషా సూచించారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం పాడేరు డివిజన్ పరిధిలోని 35 పిహెచ్‌సిలలో కొత్తగా నియమితులైన రెండవ బ్యాచ్ ఎంఎల్‌హెచ్‌పిలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీల ఆరోగ్యం, హైరిస్క్ గర్భిణీల సమాచారం, మాతా శిశు మరణాలపై ఎంఎల్‌హెచ్‌పిలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో వైద్య సేవలు పక్కాగా ఉండాలని, ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరితో సరైన కమ్యూనికేషన్ ఉంటే ఆరోగ్య పరమైన సమాచారం అందడంతో పాటు వారికి సరైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. వ్యాధులపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు. రక్తహీనత ఉన్న వారి వివరాలు పొందుపరచాలని, వీరు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యాక్రమంలో వైద్యాధికారులు సింధూరం పడాల్, విఘ్నేష్, జిల్లా గణాంకాదికారి జె.కైలాస్, జిల్లా టిబి పర్యవేక్షకులు వి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం : ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి- పెదబయలు:గృహ సారథులు, కన్వీనర్లు, వాలంటీర్స్, నాయకులు ఈనెల ఈనెల 11వ తేదీ నుంచి ప్రతి గడపగడపకు వెళ్లి, వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సూచించారు. స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజవర్గం నాయకులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు వినయ్, సూర్యనారాయణ, సూరయ్య, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు వెంటనే ప్రారంభించాలి

గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అర్జున్ దొర

ప్రజాశక్తి ఎటపాక

రాష్ట్ర ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు తునికాకు టెండర్లను వెంటనే ప్రారంభించాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కాక అర్జున్ దొర డిమాండ్ చేశారు. గిరిజన సంఘం కార్యాలయంలో బుద్దుల భద్రయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో అర్జున్ దొర మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగాక రాష్ట్ర ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు బీడీ ఆకు సేకరణను పూర్తిగా మర్చిపోయారని, ఆదివాసీల ఉపాధిని దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఆదివాసీలకు తునికాకు సేకరణ ద్వారా రావాల్సిన ఆదాయం, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో దక్కకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2012 నుండి 2022 వరకు తునికాకు సేకరణ బోనస్ చెల్లించకుండా సేకరణదారుల శ్రమని ప్రభుత్వం దోచుకుంటుందన్నారు. పెండింగ్లో ఉన్న బోనస్‌లను జాప్యం చేయకుండా వెంటనే సేకరణదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, చత్తీస్‌ఘడ్‌లో కట్టకు రూ.4 నుండి రూ.5 ఇస్తుంటే, ఎపి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.50 కూడా చెల్లించడం లేదని పేర్కొన్నారు. బోనస్ పేరుతో పచ్చికట్టకు సరైన ధర చెల్లించడం లేదని, బోనస్ కూడా చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చింతూరు డివిజన్లో నాణ్యమైన తునికాకు లభ్యమవుతుందని, కావున బోనస్ లేకుండా ఒకేసారి పచ్చి కట్టకు రూ.5 చొప్పున చెల్లించాలని, తక్షణమే టెండర్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు సవలం రాము, నక్కా సూరిబాబు, పొడియం దశరథ్, లక్ష్మీనారాయణ, రమాదేవి, కమల, రాములమ్మ, రత్తమ్మ, చిట్టెమ్మ, అంజి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అర్జున్ దొర

స్పందనకు 61 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి 61 అర్జీలు అందాయి. వీటిని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఐటీడీఏ ఎపిఓ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. వై.రామవరం మండలం పాతకోట పంచాయతీ పరిధి తంగేడికోట నుండి కొప్పులకోట వరకు మెటల్ రోడ్డు, ఆర్.కొప్పులకోటలో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని, గృహాలు మంజూరు చేయాలని టి.బంతిరాజు కోరారు. చింతలపూడి పంచాయతీ పరిధి కన్నీరు వాగు చెక్ డ్యాంకు పూడికతీతలు తీయాలని, పెద్ద దెయ్యాలకట్టు వాగు నుండి పంట పొలాలకు 300 మీటర్లకు ఇరువైపులా సీసీ వాలు ఏర్పాటు చేయాలని ఆ పంచాయతీ ఉప సర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి అర్జీ ఇచ్చారు. చవిటిదిబ్బలులో ప్రభుత్వం ద్వారా రైతుల పొలాలకు ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్లు పని చేయడం లేదని, వాటిని బాగు చేయాలని గేదెల అబ్బాయి రెడ్డి కోరారు. రంపచోడవరం మండలం బందపల్లి నుండి పెదకోరుమిల్లి వరకు ఐదు కిలోమీటర్లకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని చవలం బుల్లి దొర విజ్ఞప్తి చేశారు. కాకవాడ నుండి కొయ్యలగూడెం వరకు 15 కిలోమీటర్లకు బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని, ఈతపల్లి కాలువపై వంతెన నిర్మించాలని ఆకూరు సర్పంచ్ కొమరం పండుదొర, ఎంపీటీసీ నర్రి పాపారావు విజ్ఞప్తి చేశారు. తను ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నానని, రెండు కాళ్లు పనిచేయడం లేదని, ఎటువంటి ఆధారం లేదని, తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని దేవీపట్నం మండలం దేవారం గ్రామానికి చెందిన వికలాంగురాలైన తుర్రం వెంకటలక్ష్మి దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నాగేశ్వరరావు, ఎండి యూసఫ్, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు. డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

వెట్టిచెలకలు రోడ్డు సమస్యను పరిష్కరించాలని వినతి

రంపచోడవరం : మండలం, వెట్టిచెలకలు రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామస్తులు సోమవారం స్పందన కార్యక్రమంలో ఐటిడిఎ పిఒకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేసి వదిలేస్తున్నారని, రోడ్డు నిర్మాణం మాత్రం కావడం లేదని వారు పేర్కొన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీనికి స్పందించిన పిఒ సంబంధిత అధికారులకు సమస్య పరిష్కారం కోసం ఆదేశించి వెంటనే రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చోడి మొత్తాయి దొర, మడకం వీరాయమ్మ, కుర్ల పాండవ రెడ్డి, కొండ్ల సన్యాసి రెడ్డి, వంజం ముత్తన్న దొర, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ నేతల ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అసంపూర్తిగా ఉన్న కోర్రాయి వంతెనను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి శాంతకుమారి డిమాండ్ చేశారు. సోమవారం ఆమె అసంపూర్తిగా నున్న వంతెన వద్ద ఆ పార్టీ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆంధ్ర, ఒడిస్సా కొక్కెలిటీ గల ఈ రోడ్డులో వంతెన అసంపూర్తిగా ఉండటంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి తోడు వర్షాకాలంలో గెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. వంతెన నిర్మాణానికి పునాదులు వేసి సుమారు రెండేళ్ళు గడుస్తున్నా పూర్తిస్థాయిలో నిర్మించక పోవడంతో ఆ ప్రాంత గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రతినిధి పి.చిన్నస్వామి, అరకు పార్లమెంట్ నాయకులు సిహెచ్ సాయిబాబా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతురాజు, మహిళా నాయకురాలు పద్మ, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు: తపాలా శాఖ పొదుపు పథకాలపై కేంద్ర ప్రభుత్వం పెంచిన వడ్డీరేట్లపై ప్రజలకు పోస్టాఫీస్ లలో అవగాహన కల్పిస్తున్నామని తపాలా శాఖ పాడేరు అరకు సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్ మురళి ఉపేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 8 నుండి 10 వరకు మూడు రోజుల పాటు అన్ని తపాలా కార్యాలయాలలో సుకన్య సంవృద్ధి యోజన ఖాతాల మేళాను నిర్వహిస్తామన్నారు. 10 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు సుకన్య సంవృద్ధి యోజన ఖాతాను కేవలం రూ.250తో మాత్రమే ప్రారంభించవచ్చునని తెలిపారు. పాడేరు, మాడుగుల, హుకుంపేట, పెదబయలు, అరకు సబ్ పోస్టాఫీసుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని పాడేరు సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్ మురళి, అరకు సబ్ డివిజనల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు.

కాఫీ ప్రోత్సాహకాలు చెల్లించాలి

ప్రజాశక్తి-జి.మాడుగుల: 2020 సంవత్సరం నుండి బకాయి పడిన కాఫీ ప్రోత్సాహకాలు రైతులకు చెల్లించాలని బోయితలి సర్పంచ్ ఎల్.మాలన్న కోరారు. పాడేరు ఐటిడిఎ కేంద్రంలో సోమవారం పలు అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. కాఫీ ప్రాజెక్టు 2024తో గడువు ముగుస్తుండగా, కాఫీ ప్రాజెక్ట్ లేకపోతే రైతులకు ప్రధానమైన జీవనోపాధి కోల్పోతారని తెలిపారు. గడువు పునరుద్ధరించాలన్నారు.

తెలుగు సినిమా ఉత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు తొలి సినిమా భక్త ప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదల అయి నేటికి 91ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన మూడు రోజుల పాటు తెలుగు సినిమా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. ఈ ఉత్సవాన్ని పౌర గ్రంథాలయంలో దర్శకుడు వివిన్ ఆదిత్య సోమవారం ప్రారంభించారు. తొలుత కె.విశ్వనాథ్, జమున ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దర్శకుడు ఆదిత్య మాట్లాడుతూ, మానవ విలువలను స్పృశించే సినిమాలను ప్రజలకు చేరువ కావాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విశాఖ ఫిల్మ్ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం స్పందించి చొరవ తీసుకోవాలని, సినీ ప్రేక్షకులు ఒక కమిటీగా ఏర్పడి పాలకులపై ఒత్తిడి తేవాలని సూచించారు. తాను ఇక్కడే చదువుకున్నానని, విశాఖపై పూర్తి అవగాహన ఉండటంతో తన చిత్రాలను ఎక్కువగా ఇక్కడే చిత్రీకరిస్తున్నానని తెలిపారు. పారిశ్రామికవేత్త భరణికాన రామారావు మాట్లాడుతూ, ప్రజలు మంచి సినిమాలను చూసే అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం కె.విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన జమున నటించిన ఉండమ్మా బొట్టు పెడతా చిత్రాన్ని ప్రదర్శించారు.

రూ.962 కోట్లతో కాఫీ విస్తరణకు ప్రతిపాదనలు

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రానున్న ఐదేళ్లలో ఏజెన్సీలో పెద్ద ఎత్తున కాఫీ విస్తరణకు రూ.982 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. ఐటిడిఎ బి.ఆర్.అంబేద్కర్ సమావేశ మందిరంలో కాఫీ అధికారులు, ప్రగతిశీల కాఫీ రైతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీలో 2 లక్షల 13 వేల మంది గిరిజన రైతులు కాఫీ సాగు చేస్తున్నారని చెప్పారు. 2015లో మంజూరు చేసిన కాఫీ ప్రాజెక్టు 2023-24 ఆర్థిక సంవత్సరంతో ముగిసి పోతుందని తెలిపారు. లక్ష ఎకరాలల్లో నీడ తోటలు, 50 వేల ఎకరాల్లో కాఫీ పునరుద్ధరణ, 75 వేల ఎకరాల్లో కాఫీ తోటల విస్తరణ చేశామన్నారు. 2020 జూలై నుండి 9 విడతల్లో 1.08 లక్షల ఎకరాలకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. ఆయా భూముల్లో కొంత మేరకు కాఫీ సాగు చేస్తున్నారని, మిగిలిన భూముల్లో కాఫీ సాగు విస్తరించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. కాఫీ విస్తరణకు కాఫీ అధికారుల ఆలోచనలకు కాఫీ తోటల్లో ప్రగతి సాధిస్తున్న రైతుల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుని కాఫీ విస్తరణ, పునరుద్ధరణ, సిల్వర్ ఓక్, నీడినిచ్చే పనస, నేరేడు సంపంగి, కొండ మామిడి మొక్కలు రైతలకు అందించాలన్నారు. విస్తరణకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని చెప్పారు. కాఫీ రైతులు కాఫీ కల్లాలు నిర్మించుకోవడానికి 1 కోటి 35 లక్షలతో కాఫీ బోర్డుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. కాఫీ రైతుల పిల్లలు ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్దులకు ఏడాదికి రూ.2250, వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న వారికి రూ.3750లు ఉపకార వేతనాలు కాఫీ బోర్డు నుండి అందించడానికి ప్రతిపాదిం చామన్నారు. గిరిజన కాఫీ రైతులు మాట్లాడుతూ, మిక్సిడ్ షేడ్‌తో పాటు అధిక ఆదాయాన్నిచ్చే కమల, దాల్చిన చెక్క మొక్కలు, లవంగం, యాలికలులు మొక్కలను రైతులకు పంపిణీ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ ఎం.వెంకటేశ్వరరావు, కాఫీ సహాయ సంచాలకులు ఎన్.అశోక్, 11 మండలాల కాఫీ ఎఇఒలు, హార్టీకల్చర్ కన్సల్టెంటులు, కాఫీ రైతులు పాలికి లక్కు, కంటా రాజారత్నం, లంకెల విశ్వేశ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ

ఆసుపత్రి కార్మికులకు ఫేస్ యాప్ రద్దుచేయాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బాలదేవ్



ఆందోళన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ : అరకులోయ ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు ఫేస్ అటెండెన్స్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్ మాట్లడుతూ, ప్రభుత్వం కార్మికులకు చాలీ చాలని వేతనాలు ఇచ్చి ఇబ్బందులకు గురి చేస్తుందని విమర్శించారు. ఫేషియల్ యాప్ తీసుకొచ్చి కార్మికులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం సక్రమంగా చెల్లించాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేసి వైద్య విధాన పరిషత్ నేరుగా పారిశుద్ధ్య కార్మికులకు ,సెక్యూరిటీ గార్డులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రఘు, మోహన్, బాలన్న, ద్రౌపతి, సూర్య, వరహాలమ్మ,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలపై ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండలంలోని అరమ పంచాయతీ బడిమెల గ్రామంలోని ఉపాధి కూలీలు చేపట్టిన బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆ గ్రామంలో 12 స్వయం శక్తి సంఘాలున్నాయని, ఈ గ్రూపులకు చెందిన ఉపాది కూలీలు సుమారు 120 మంది వరకు ఉన్నారని చెప్పారు. గత ఏడాది మార్చి నెలలో భూమి చదును పనులు ఉపాది కూలీలు 2 వారాల నుంచి 5 వారాలు వరకు చేశారన్నారు. ఇప్పటి వరకు బిల్లులు చెల్లించక పోవడంతో గ్రామంలోని ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బిల్లులు చెల్లించక పోవడంతో కొత్తపనులు చేయుటకు నిరాకరిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బకాయి బిల్లులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు టి.రామారావు, జి.జగన్నాథం, కె రామకృష్ణ, బలరాం, ఉపాది కూలీలు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు

నేరాలు ఘోరాలు

కొట్లాటలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని సొంట్యాం పంచాయతీ ఎన్‌జిఆర్ పురం-1లో ఆదివారం అర్ధరాత్రి భూ వివాదంలో జరిగిన కోట్లాటలో పలువురికి గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... సొంట్యాం పంచాయతీ గొంతివానిపాలెం గ్రామానికి చెందిన ప్రసాదునాయుడు, సారిపల్లి నూకమ్మ, ప్రసాదు కన్నమ్మ, ప్రసాదు రాము, సారిపిల్లి అప్పలరాజులకు ఎన్‌జిఆర్ పురం సర్వే నెంబరు 12 / 8 లో 25 సెంట్లు స్థలం ఉంది. ఈ స్థలం పక్కన రవిరేష్ పెట్రోల్ బంక్ యజమాని పర్వతనేని సురేష్ బంకు ఉంది. బంకు పక్కన ఉన్న ఈ స్థలంపై కన్ను పడిన సురేష్ గతంలో అనేకసార్లు బెదిరించినట్లు స్థల యజమానులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 1:30 సమయంలో సుమారు వందమంది గుండాలను తీసుకొచ్చి స్థలంలో ఉన్న ప్రసాద్‌నాయుడు కుటుంబ సభ్యులను, మరి కొంతమందిని బెదిరించి కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో ప్రసాద్ నాయుడుతో పాటు వారి కుటుంబ సభ్యులు, మహిళలు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులు ప్రసాద్‌నాయుడు అర్ధరాత్రి 100కు డయల్ చేయగా స్పందించకపోవడంతో ఎసిపిని సంప్రదించారు. ఎసిపి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దౌర్జన్యంపై కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికునికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఎస్‌బిఎం విభాగంలో జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు ఎం.మురళీకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం సాయంత్రం వెనకనుంచి ఫోర్క్ లిఫ్ట్ ఢీకొట్టడంతో కాలు నుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే ఫస్ట్ ఎయిడ్ విభాగానికి తరలించారు. అక్కడి నుంచి మల్కాపురంలోని ఇఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. లంకెలపాలెంలో ఉంటున్న బాధితునికి న్యాయం చేయాలని తోటి ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

గంగవరం పోర్టు కాలుష్యంపై సిపిఎం ధర్నా

ప్రజాశక్తి- గాజువాక: గంగవరం పోర్టు కాలుష్యం నివారించాలని, ప్రజలు ఆరోగ్యాలు కాపాడాలని కోరుతూ జివిఎంసి 76వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లోని వై జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ, గంగవరం పోర్టు కాలుష్యం వల్ల సుమారు 10 గ్రామాలు ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలను గంగవరం పోర్టు యాజమాన్యం పాటించకుండా కాలుష్యాన్ని ప్రజలపై వదులుతూ అనారోగ్యానికి గురిచేస్తోందని తెలిపారు. పోర్టు లాభాలు అదానీకి, రోగాలు ప్రజలకా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ పోర్టు కాలుష్యం వల్ల వై.జంక్షన్‌లో ద్విచక్ర వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. కనీసం బొగ్గు లారీలపై తార్పాలిన్లను కూడా వేయకుండా పంపిస్తున్నారని పేర్కొన్నారు. గంగవరం పోర్టు యాజమాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, కాలుష్యానికి గురవుతున్న గ్రామాలను గంగవరం పోర్టు యాజమాన్యం దత్తత తీసుకొని ప్రజలు ఆరోగ్యానికి అయ్యే ఖర్చు భరించాలని డిమాండ్ చేశారు. కాలుష్యానికి గురవుతున్న గ్రామాల్లో ఉచిత మెడికల్ క్యాంపులను యాజమాన్యం నిర్వహించాలని కోరారు. రామచంద్రనగర్ డంపింగ్‌యార్డుపై శనివారం ధర్నా చేస్తామని, దాన్ని పూర్తిగా తరలించేవరకు రిలే నిరాహార దీక్షలు కూడా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, లోకేష్, డి.రమణ, లక్ష్మి, శ్రీదేవి, సుబ్బారావు, రాజారావు, అర్జునరావు, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

8 నుంచి టార్గెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి-మధురవాడ : అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎఐయు) ఆధ్వర్యాన గీతం విశ్వవిద్యాలయంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల టార్గెట్ బాల్ పోటీలు (పురుషుల విభాగం) నిర్వహించనున్నట్లు గీతం క్రీడా విభాగం డైరక్టర్ అరుణ్‌కార్తీక్ తెలిపారు. గీతంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ పోటీల్లో దేశంలోని 29 విశ్వవిద్యాలయాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొంటారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గీతం, ఆంధ్ర, నాగార్జున, కెఎల్‌యు విశ్వవిద్యాలయాలతో పాటు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ జట్లు పాల్గొంటాయని తెలిపారు. విలేకర్ల సమావేశంలో గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరక్టర్ శ్రీనివాస్, మేనేజర్ రితేష్ సిన తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రకాష్

పామాయిల్ సాగుతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రైతులు పామాయిల్ తోటలు సాగు చేయడం ద్వారా మంచి ఆర్థికాభివృద్ధి చెందవచ్చునని రుచి ఆయిల్ ఫామ్ ఎజిఎం ప్రకాష్ అన్నారు. మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆయిల్ పామ్ తోటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10వేల హెక్టార్లలో పామాయిల్ తోటలు రైతులు పెంచుతున్నారని తెలిపారు. ఏడాదికి ఒక ఎకరం పొలంలో లక్ష రూపాయల వరకు ఆదాయం వస్తుందన్నారు. ప్రతీ ఏటా ప్రభుత్వం రైతులకు రూ.5వేలు విలువైన మందులు, ఎరువులు ఉచితంగా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బలక్ష్మి, మాజీ సర్పంచ్ అప్పారావు, ఉద్యాన వన శాఖ అసిస్టెంట్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న దాతలు

గిరిజనులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - సీలేరు : ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ (ఓ అండ్ డ్యామ్) వెంకటేశ్వరరావు దంపతులు గిరిజనులకు సోమవారం వస్త్రాలను పంపిణీ చేశారు. మూడేళ్లగా ఏపీ జెన్కో ఎస్ఇగా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రత్యేకమైన రోజుల్లో గిరిజనులతో గడపడం అలవాటుగా ఉంది. ఈ క్రమంలోనే వెంకటేశ్వరరావు కుమార్తె హారిక జన్మదినాన్ని పురస్కరించుకొని ఆంధ్ర ఒడిశా సరిహద్దు గ్రామమైన అరిగిలిలో గిరిజనులకు దుప్పట్లు, తువ్వాలు, లుంగీలు, చీరలు పంపిణీ చేశారు. అక్కడి గిరిజనులతో రెండు గంటల పాటు ఆనందంగా గడిపారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల్ని పాఠశాలలకు పంపించాలని గిరిజనులకు సూచించారు.

స్కానింగ్ మిషన్ సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మరికొన్ని రాష్ట్రాల పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న కెజిహెచ్‌లో స్కానింగ్ మిషన్ నెలలు తరబడి పని చేయకుండా ఉన్నప్పటికీ మరమ్మతులు చేయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు అన్నారు. సోమవారం సిఐటియు జగదాంబ జోన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్ఐ స్కానింగ్ మిషన్ అన్ని వ్యాధుల నిర్ధారణలో ఎంతో ముఖ్యమన్నారు. అటువంటి మిషన్‌ను నిర్లక్ష్యంగా విడిచిపెట్టడం సరికాదన్నారు. కెజిహెచ్‌లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందివ్వాలన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసే వైద్య పరికరాలు కెజిహెచ్‌లో ఉన్నా, అవి పని చేయలేని పరిస్థితిలో ఉన్నాయని తెలిపారు. బిపి, సుగర్, మూర్ఛ వంటి వ్యాధులకు కూడా మందులు ఇక్కడ లేవన్నారు.

విశాఖ.. సినీ పరిశ్రమకు అనుకూలం

ప్రముఖ దర్శకుడు వివిన్.ఆదిత్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సినీ పరిశ్రమ కేంద్రంగా అభివృద్ధి చెందడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని ప్రముఖ దర్శకుడు వివిన్.ఆదిత్య అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ హిందీ భవన్‌లో సోమవారం ఉదయం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ద కాలంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మంచి సినిమాలను వెలికి తీయడంలోనూ, సినిమా విధివిధానాలను తెలియజేయడంలోనూ సఫలీకృతమైందని పేర్కొన్నారు. విశాఖపట్నం, అరకు ప్రాంతాలు సినిమా చిత్రీకరణలకు ఎంతో చక్కనైన ప్రదేశాలన్నారు. మనసంతా నువ్వే చిత్రీకరణ సమయంలోనే విశాఖపట్నంలో ఉన్న అందమైన ప్రాంతాలను తాను చిత్రీకరించిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా మరింతగా సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రభుత్వం సైతం పరిశ్రమకు తగు రీతిలో సహకరించాలన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన మూడు రోజులపాటు జరుగనున్న ఫిలిం ఫెస్టివల్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు తాను వచ్చానన్నారు. తద్వారా ఇక్కడి వారి ప్రతిభను వెలికితీసేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి.పాల్, గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ వర్క్ షాప్‌ను యువ లఘు దర్శకులు, సినీ ప్రియులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాశీ విశ్వేశ్వరరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సొసైటీ తరపున ఆదిత్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దర్శకుడు ఆదిత్య

ఎయు విసి అక్రమాలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఆంధ్రా యూనివర్సిటీ విసి ప్రసాద్‌రెడ్డి అక్రమాలపైనా, విద్యార్థి, ఉద్యోగ, అధ్యాపక, ప్రజా వ్యతిరేక విధానాలపైనా ఉన్నత స్థాయి విచారణకు కమిషన్ నియమించాలని, వర్సిటీలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలని విద్యార్థి, యువజన, అభ్యుదయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వేదిక తరుపున ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు, ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, ఎయు ప్రొగ్రెసెవ్ ఫోరం నాయకులు డాక్టర్ పొన్నాడ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతిష్టాత్మక ఆంధ్రా యూనివర్సిటీ విసి ప్రసాద్‌రెడ్డి పాలనలో అప్రతిష్ట పాలవుతోందన్నారు. విసి విధానాలకు వంత పాడేవారినే పాలకమండలి సభ్యులుగా నియమించుకున్నారని తెలిపారు. నేడు ఎయును ఒక వ్యాపార కేంద్రంగా మార్చేశారన్నారు. వర్సిటీ భూములను విసి తన సొంత మనుషులకు లీజుల పేరిట అప్పగిస్తూ వర్సిటీ భవిష్యత్తును మంటగల్పుతున్నారని మండిపడ్డారు. హెరిటేజ్ కోర్సులకు కూడా మితిమీరిన ఫీజులు పెంచారన్నారు. ఇప్పటికే కొన్ని మెస్‌లను పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని చెప్పారు. ఎయును పేదలకు దూరం చేసి, పెద్దలకు చేరువ చేస్తున్నారని విమర్శించారు. మహరాణిపేటలోని ఎయు హాస్టల్స్ స్థలాన్ని అమ్మేసే దిశగా విసి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిభావంతులైన సుమారు 20 మంది కాంట్రాక్ట్, 260 మంది గెస్ట్ ఫ్యాకల్టీలను అక్రమంగా తొలగించారని తెలిపారు. సమావేశంలో పిఎస్ఎఫ్ నాయకులు కె.దేవ, టిఎస్ఎఫ్ నాయకులు శోభన్ కుమార్, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని విజయాలు సాధించాలి

అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన అల్లూరి స్టడీ సర్కిల్ విద్యార్థులను అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు అభినందించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఇదే స్ఫూర్తితో శ్రమించి మరిన్ని విజయాలు సాధించాలని కాంక్షించారు. స్టడీ సర్కిల్ నుంచి 12 మంది విద్యార్థులు అర్హత సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్యను అందించడమే అల్లూరి స్టడీ సర్కిల్ లక్ష్యమన్నారు. శిక్షణా తరగతులు ప్రారంభించిన అతి తక్కువ కాలంలోనే అరుదైన విజయాలు సాధించినట్లు తెలిపారు .తాజాగా విడుదలైన గ్రూప్ - 1 పరీక్షల్లోనూ ఐదుగురు విద్యార్థులు అల్లూరి స్టడీ సర్కిల్ నుంచి అర్హత సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రూప్ - 2 శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయని, ఆసక్తిగల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008412798 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం మేనేజర్ కిరణ్ కుమార్, అభిమన్యు పాల్గొన్నారు.

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రజలు ఏవైనా సమస్యలుంటే నిర్భయంగా రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ ల్యాండ్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని స్థానిక ఎస్సై టీజీ నరేంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్ ల్యాండ్ 08865 275533 నెంబర్ పునరుద్ధరించడం జరిగిందని తెలిపారు. అసాంఘిక, సంఘ విద్రోహక కార్యకలాపాలు, ఇతర ప్రజా సమస్యలపై ఫిర్యాదులను నేరుగా ల్యాండ్ లైన్‌కు చేయవచ్చునని పేర్కొన్నారు. ల్యాండ్ లైన్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

జగనన్న ఇళ్ల సమస్యలపై సిపిఐ ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. జగనన్న ఇళ్ల సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలు ఏర్పాటు చేసి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, ఇళ్ల నిర్మాణాలకు సరిపడిన రీతిలో నిధులు కేటాయించకపోవడంతో కాలనీలు ఎడారులను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు బహిరంగ మార్కెట్‌లో ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంటు, స్టీలు, కంకర, ఇటుక, తదితర నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ఆ ధరలను ఏ మాత్రమూ పరిగణలోకి తీసుకోకుండా 'ప్రభుత్వం తరపున రూ.లక్షా 80 వేలు మంజూరు చేస్తాం.. లబ్ధిదారులు రూ.35 వేలు చెల్లిస్తే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తాం' అని పేర్కొనడం పేద వర్గాలపై పెను భారం వేసినట్టేనని అన్నారు. నేడు పెరిగిన ధరల ప్రకారం ఒక సెంటు స్థలంలో ఇల్లు నిర్మాణం జరగాలంటే కనీసం రూ.7 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే నిర్మాణ వ్యయాన్ని రూ.5 లక్షలకు పెంచి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కె.రెహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, క్షేత్రపాల్, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎపిఎఫ్ఆర్ఎస్‌తో తీవ్ర నష్టం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపిఎఫ్ఆర్ఎస్ విధానం జివిఎంసికి, కార్మికులకు ఎంతో నష్టదాయకమని, తక్షణం దీన్ని నిలుపుదల చేయాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నూకరాజు, యు.రాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం జివిఎంసి అడిషనల్ కమిషనర్‌కు, ప్రధాన వైద్యాధికారికి యూనియన్ తరుపున వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ఫీల్డ్‌లో పనిచేసే పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను మినహాయించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు, ఉపాధ్యక్షులు ఎస్.రమణ, జె.నాయుడు, కార్యదర్శులు ఎం.ఈశ్వరరావు, ఎస్.గణేష్, ఇ.ఆదినారాయణ, రత్నం, శేషుబాబు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 59 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆధ్వర్యాన ప్రతి సోమవారంలానే ఈసారీ స్పందన కార్యక్రమం నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. సిపి శ్రీకాంత్, డిసిపి (క్రైమ్) జి.నాగన్న పాల్గొని వినతులు స్వీకరించారు. 59 మంది నుంచి ఫిర్యాదులు అందినట్టు అధికారులు తెలిపారు. వాటిలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్యాభర్తల గొడవలు, మోసాలకు సంబంధించినవే అత్యధికం ఉన్నాయన్నారు.

బిఆర్‌టిఎస్ రోడ్డులో పెట్టిన కేసులు ఎత్తేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పెందుర్తి నుంచి కంచరపాలెం మెట్టు వరకు చాలా రద్దీగా ఉండే ప్రాంతంలో ఉన్న బిఆర్‌టిఎస్ రోడ్డు మధ్య భాగం గుండా వెళ్లిన కార్లకు భారీ ఎత్తున విధించిన జరిమానాలను రద్దు చేయాలని, పెట్టిన కేసులను ఎత్తివేయాలని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్ డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఈ మేరకు జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్‌టిఎస్ సర్వీసు రోడ్లలో మాత్రమే అన్ని వాహనాలూ వెళ్ళాలని, మధ్య రోడ్డులో ఆర్‌టిసి బస్సులు మాత్రమే వెళ్ళాలని షరతు పెట్టారన్నారు. అయితే సర్వీసు రోడ్లు ఎప్పుడూ రద్దీగా ఉంటున్నాయని, మధ్య రోడ్డు మాత్రం పూర్తిగా ఖాళీగా ఉంటోందని తెలిపారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్‌ను కలిసినప్పుడు సిపితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు రద్దీ టైంలో కార్లు మధ్య రోడ్డులో వెళ్లాయని పేర్కొంటూ ఒక్కొక్క కారుకు రూ.2030 జరిమానా వేస్తున్నారని తెలిపారు.